కథ

# మరో ప్రేమకావ్యం

సయ్యద్ గఫార్
81432 53116

ఎర్రగడ్డ గోకుల్ టాకీసుల మొదటి ఆట సిన్మా ఇడ్సివెట్టింద్రు. కుంటి పతంగి, సుక్కి.. టాకీస్‌లకెల్లి బైటికొచ్చి ఇంటి బాటవట్టింద్రు.

అది వానకాలం. పొద్దటికెల్లి ఇడ్సివెట్టకుండ వాన వడ్తనే ఉంది. పతంగి సగం తడుస్తా, సుక్కి తడవకుండా గొడుగు వట్టుకొని నడుస్తుంద్రు. వాడికి సుక్కి అంటే పంచప్రాణాలు.

సుక్కికి ఇరువై ఏండ్లుంటయి. ఆమెకంటె రెండేండ్లు పెద్దోడు పతంగి. కొన్నాళ్లుగా వాళ్లిద్దరూ ఒకళ్లను ఇడ్సివెట్టి ఒకళ్లు ఉండలేక వోతుంద్రు.

పతంగికి మూడేళ్లప్పుడు పోలియో సోకటాన ఎడమ కాలు కొద్దిగంత చిన్నగుంటది. కుంటుకుంట నడుస్తడు. చిన్నప్పటికెల్లి సుక్కి – పతంగి ఒక్కతానే పెరగటాన.. అందరు విల్సినట్లే.. 'రేయ్ కుంటోడా!' అనే విల్సేది సుక్కి. కానీ, కొన్ని దినాలుగా వాడినట్టా పిల్వటానికి సుక్కి మనసెందుకో ఒప్పుకొంటలేదు.

కొద్దిదూరం వోయింద్రో లేదో.. వాన జోరందుకుంది.

గొడుగు వట్టుకొని నడుస్తున్న పతంగి కాలుజారి.. రోడ్డు పక్కనున్న మురికి గుంతలో వడవోయిండు. అది సూసి, సుక్కి వాన్ని గబుక్కున రెండు చేతుల్తో గట్టిగా వట్టుకుంది. వాడు నిలదొక్కుకొని.. నిలవడి సుక్కివైపు కృతజ్ఞతగా సూస్తా..

''ఇట్టనే ఈ కుంటోనికి బతికినన్నాల్లూ ఊతంగా ఉంటవా సుక్కి?'' అని ఆశగా అడిగిండు.

''ఓ అట్టనే ఉంటా! మరి గిప్పుడు గీ వానకు నేను తడ్వకుండా వట్టుకున్న గొడుగులెక్కనే.. నూగూడా నా బతుకంతా ఆసరాగా ఉంటవా?'' అనడిగింది సుక్కి.

''ఉత్త గొడుగులెక్కనే కాదే.. కంటికి రెప్పలా సూసుకుంట!''..

వాడన్న మాటతో సుక్కి సంతోషంతో పొంగివోయింది.

ఇద్దరూ నడ్సుకుంట మోతీనగర్ సెంటర్ దాటింరు. కొద్దిదూరం నడ్సినంక..

''ఒరేయ్ రాజూ! ఆనల తడ్వవాకు బిడ్డా! సర్దిజేస్తదీ!'' అనే మాటలు ఇన్పడ్డయి.

అచ్చం వాళ్లమ్మ మాటల లెక్కనే ఇన పడేసరికి.. ఉలికిపడి ఒక్కపాలిగా ఆగిపోయిండు పతంగి. దిగాలువడి వాళ్లమ్మ యాదిలకు వోయిండు.

అమ్మ – తను శేరిలింగంపల్లిల రైల్‌స్టేషన్ దగ్గర గుడిసెల ఉండేది. కూలి పనికి పోయేది. అప్పుడు తనకు ఎనిమిదేండ్లు. గవర్మెంటు బళ్లె మూడో క్లాస్ చదువుకునేటోడు. ఎవల మాయలో పడిందో ఏమో.. ఓ అద్దరాత్రి వాణ్ని ఒంటరిగా ఒగ్గేసి ఎటో ఎల్లిపోయింది అమ్మ.

''మీ అమ్మ ఎర్రగడ్డ కాడ కన్పడింది'' అని ఎవల్లో చెప్తే..

అమ్మను వెతుకుతూ ఎర్రగడ్డకాడికి వచ్చిండు. అక్కడ ఏడుస్తూ తిరుగుతూంటే.. ఎల్లయ్య తాత చూసి, తన కథ విని.. వెంట తోల్కొచ్చిండు. తన ఐదేండ్ల మనుమరాలు సుక్కికి పరిచయం చేసిండు. తమతోపాటే ఉంచుకున్నడు. తెగిన పతంగిలెక్క బజార్ల దొరికిండనీ, 'రాజు'కు బదులుగా 'పతంగి' అని పేరువెట్టి, రాంపాల్ రెడ్డి స్క్రాప్ దుకాణంల పనికి పెట్టిండు. అట్ల రోజులు గడుస్తున్నయి.

తనకు పదిహేనేండ్లప్పుడు, ఓ ఖాళీ గుడిసె చూపించి..

'బిడ్డా పతంగీ! ఈరోజు నుండి నూ ఇండ్లనే వండుక తింటూ, ఇండ్లనే ఉండూ!' అన్నడు.

అప్పటిసంది ఆ గుడిసెలనే ఉంటున్నడు. అట్ల ఆలోచించుకుంటూ నడుస్తున్న పతంగికి.. తను పనిచేసే స్క్రాప్ దుకాణం కాడికొచ్చింది గూడా ఎర్కకాలే.

